క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర



తెనాలిఅర్బన్: అనధికారికంగా ఏర్పాటు చేసిన సెంట్రింగ్‌ను మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం తొలగించారు. అధికారుల కథనం ప్రకారం గంగానమ్మపేటలోని భవనం వారి వీధిలో జీ+2 భవన నిర్మాణం కోసం మున్సిపల్ అధికారుల నుంచి ఓ వ్యక్తి అనుమతి తీసుకున్నారు. మంగళవారం 3వ అంతస్తు నిర్మించేందుకు సెంట్రింగ్‌ను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న టీపీవో సాంబశివరావు తన సిబ్బందితో అక్కడకు వెళ్ళి సెంట్రింగ్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలు జరిపేవారు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతి తీసుకోవాలని సూచించారు. అలా తీసుకోని వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి



తెనాలిఅర్బన్: గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని గంగానమ్మపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించేందుకు అవసరమైన మందులు వాడాలని సూచించారు. అలాగే ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం చేయించుకునేందుకు సిద్ధపడాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికలు ఏకగ్రీవం



తెనాలి: కూటమి పార్టీల సర్దుబాటుతో పట్టణంలోని నెం.22 ది తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నామినేషన్ల ప్రక్రియ తర్వాత ఎన్నికైన అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారి కుర్రా వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఒక్కో డైరెక్టర్ పదవికి ఒక్కో నామినేషను మాత్రమే దాఖలైనందున పరిశీలన అనంతరం ఏకగ్రీవమైనట్లు తెలియజేశారు. ఎన్నికైన సభ్యులు అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కనగాల శ్రీనివాసరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, కోట పున్నారావు, కందేపి హరిప్రసాదరావు, గడ్డిపాటి నాగయ్య, గండపనేని పూర్ణచంద్రరావు, తోట చంద్రశేఖర్, దొప్పలపూడి శ్యాంసన్, బచ్చు శ్రీనివాస్, మంగమూరి హరిప్రసాదరావు, షేక్ జిలాని. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు.

బీసీల ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి



మంగళగిరి టౌన్: 2024 ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో బీసీ నాయకులు, వివిధ కుల సంఘ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లకు ర్యాలీగా వెళ్లి బీసీల 5 ప్రధాన డిమాండ్లపై మెమోరాండం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనాభా దామాషా మేరకు బీసీ సబ్‌ప్లాన్ రూపొందించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, ప్రత్యేక నోడల్ ఏజన్సీ ద్వారా సక్రమంగా నిధులు ఖర్చయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరి బత్తుల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

జై కిసాన్.. జై జగన్

- నిరసన ప్రదర్శనలో కదం తొక్కిన పార్టీ శ్రేణులు
- తగినంత యూరియా ఇవ్వాల్సిందేనంటూ నినాదాలు

తెనాలి: ఖరీఫ్ సీజనులో పంటల సాగుకు యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, అవసరమైన యూరియా సరఫరా చేయించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'అన్నదాత పోరు' మంగళవారం తెనాలిలో విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ నిరసన ప్రదర్శనను ప్రభుత్వం పోలీసు అధికారులతో రకరకాల మార్గాలతో అడ్డుకోవాలని చూసినా సాధ్యపడ లేదు. భారీసంఖ్యలో తరలి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు నిరసన ప్రదర్శనలో కదం తొక్కారు. హెచ్చరిక నోటీసులు పనిచేయలేదు. పరిమిత సంఖ్యలోనే అనుమతంటూ మార్గమధ్యంలో ఉంచిన బారికేడ్లను తోసేసుకుంటూ దూసుకెళ్లారు. రైతుల పక్షాన ముందుగా ప్రకటించినట్టుగా ప్రదర్శనగా వెళ్లి అవసరమైన యూరియాను సరఫరా చేయాలంటూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

స్థానిక రామలింగేశ్వరపేటలోని ఏ–1 కన్వెన్షను హాలు నుంచి ఉదయం 10.30 గంటల ప్రాంతంలో అన్నదాత పోరు నిరసన ప్రదర్శనను ప్రారంభించారు. తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజక వర్గాలకు చెందిన వందలాది పార్టీ కార్యకర్తలు, నాయకులు, రైతులు ఉదయం 9 గంటల నుంచే అక్కడకు చేరుకుంటూ వచ్చారు. జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళగిరి, పొన్నూరు సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన నందమూరి లక్ష్మీపార్వతి, శ్యామల, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ పరిశీలకుడు గులాం రసూల్, మందపాటి శేషగిరిరావులు వైఎస్సార్ సీపీ జెండా రంగులతో అలంకరించిన ఎడ్ల బండిపై బయలుదేరగా, మిగిలిన అందరూ ముందు నడిచారు. 'యూరియా సరఫరా చేయాలి', 'బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలి'... అంటూ ప్లకార్డులు చేతపట్టిన వందల మంది నాయకులు ఎడ్లబండికి ముందుగా నడిచారు. అవే నినాదాలతోపాటు జై జగన్, జైకిసాన్ అని నినదిస్తూ ప్రదర్శనలో సాగారు.

ఏ–1 కన్వెన్షను హాలు నుంచి సాగిన ప్రదర్శన ఎల్ఐసీ కార్యాలయం పక్క నుంచి బోసురోడ్డుకు చేరుకుంది. అక్కడ్నుంచి టౌన్‌చర్చి పక్కరోడ్డు నుంచిడి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. పార్కు రోడ్డులోంచి ప్రదర్శకులు వెళ్లేందుకు వీల్లేకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అక్కడ టౌన్ సీఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



అన్నదాత పోరులో పాల్గొనేందుకు తెనాలి వచ్చిన పార్టీ నేతలు

నాయకులతో కూడిన ఎడ్లబండి అక్కడకు రాగానే కార్యకర్తలు బారికేడ్లను నెట్టుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీస్ సీఐలు బలంగా అడ్డుకున్నారు. అయినప్పటికీ పార్టీనేతలు, కార్యకర్తలు, రైతులు ఖాతరు చేయలేదు. ఒక్కఉదుటున బారికేడ్లను తోసుకుంటూ సబ్‌కలెక్టర్ కార్యాలయం గేటు వద్దకు చేరుకున్నారు. మళ్లీ అక్కడా పోలీసులు బారికేడ్లనుంచి అడ్డుకోవాలని చూసినా అవకాశమీయలేదు. నేరుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోకి చేరుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్సీలు, పార్టీ సమన్వయకర్తలు, పరిశీలకుడు మాత్రమే లోపలకు వెళ్లారు. సబ్‌కలెక్టర్ అందుబాటులో లేనందున మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన ప్రదర్శనలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహిమా, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, కార్యదర్శి బొల్లిముంత పోతురాజు, జిల్లా అధికార ప్రతినిధి కొడాలి క్రాంతి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర, వివిధ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు అవుతు శేఖర్‌రెడ్డి, కొర్ర యశోద, మైలా విజయ్‌నాయుడు, గుంటూరు గోపి, ఆవుల కోటయ్య, తాతా సతీష్, నీలి అజయ్, పఠాన్ అసద్, ఉన్నవ నాని, దూరు రత్నబాబు, బండిళ్ల పోతురాజు, అక్కిదాసు కిరణ్, షేక్ దుబాయ్ బాబు, పాట్లూరి అశోక్, అత్తోట అమృతరాజు,

మంగళగిరికి చెందిన జిల్లా నాయకులు ఈదులమూడి డేవిడ్‌రాజు, ఎండీ బీజాషాహిద్, మేక వెంకట రామిరెడ్డి, ఈపూరి ఆదాం, షేక్ జావిద్, నియోజకవర్గ కమిటీల అధ్యక్షులు బందాపు రుక్మాంగారెడ్డి, తాడిబోయిన సుబ్బారావు, కట్టిపోక భూషణం, జంగా నాగిరెడ్డి, షేక్ జానిబాష, చిట్టిమళ్ల సుబ్బారావు, దర్శి రమేష్‌బాబు, భీమిరెడ్డి శరణ్ కుమార్ రెడ్డి, మేడ చైతన్య, యర్రకోటి మల్లికార్జున్ రెడ్డి, తాడేపల్లి నేతలు బుర్రముక్కు వేణు గోపాల స్వామి రెడ్డి, అమర నాగయ్య, పొన్నూరు నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి అమిరినేని శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, ఆకురాతి రాజేష్, జిల్లా అధికార ప్రతినిధి వెంకట సుబ్బయ్య, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల వెంకటేశ్వర రావు, పొన్నూరు రూరల్, పెదకాకాని ఎంపీపీలు పద్మలీలారెడ్డి, తుల్లిమిల్లి శ్రీనివాసరావు, కాకాని జడ్పీటీసీ గోళ్ల జ్యోతిజోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎడ్లబండి వాహనంపై ప్రదర్శనలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, మహిళా నేతలు లక్ష్మీపార్వతి, శ్యామల



తెనాలిలో అన్నదాత పోరులో పాల్గొన్న మహిళా నేతలు



తెనాలి దేవీచౌక్ వద్ద పోలీసు బారికేడ్లు



ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు



తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి దగ్గర్లో బారికేడ్లతో పోలీసులు

ఆంధ్రాప్యారిస్‌లో అన్నదాత.. పోరుబాట!

- విజయవంతమైన వైఎస్సార్ సీపీ కార్యక్రమం
- రైతులను ఆవేదనను అడ్డుకోలేకపోయిన నిషేధాజ్ఞలు
- నోటీసుల పేరిట నేతల కాళ్లకు దిగ్బంధాలు

తెనాలి: రైతన్నకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెనాలిలో మంగళవారం జరిగిన 'అన్నదాత పోరు' కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ పిలుపు ప్రకారం జరిపిన నిరసన ప్రదర్శన అనంతరం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. యూరియా సహా రైతులకు అవసరైమన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలనీ, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలనీ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. వీటితో పాటు వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు.

అన్నదాత పోరును భారీస్థాయిలో నిర్వహణకు పోలీసులు అభ్యంతరం చెప్పారు. సెక్షన్ 30 నిషేధాజ్ఞలను విధించారు. పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నివాసానికి వెళ్లి ఉదయాన్నే వెళ్లిన పోలీసులు, ఆయనకు నోటీసును అందజేశారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పార్టీ నాయకులకు కూడా నోటీసులు ఇచ్చారు. పరిమిత సంఖ్యలోనే పాల్గొనాలని, ర్యాలీలు, ధర్నాలు చేయరాదని చెప్పారు. స్థానిక దేవీచౌక్‌లో, సబ్‌కలెక్టర్ కార్యాలయానికి దారితీసే రెడ్‌క్రాస్ ఎదుట మలుపులో, సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బారికేడ్లను ఉంచి, పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. భారీసంఖ్యలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆంక్షలను ఖాతరు చేయలేదు. రైతులకోసం నిరసన ప్రదర్శన చేస్తున్నపుడు ఆంక్షలు ఏమిటని మండిపడ్డారు.

అన్నదాత పోరు కార్యక్రమంలో తెనాలికి చెందిన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహిమా, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, కార్యదర్శి బొల్లిముంత పోతురాజు, జిల్లా అధికార ప్రతినిధి కొడాలి క్రాంతి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర, వివిధ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు అవుతు శేఖర్‌రెడ్డి, కొర్ర యశోద, మైలా విజయ్‌నాయుడు, గుంటూరు గోపి, ఆవుల కోటయ్య, తాతా సతీష్, నీలి అజయ్, పఠాన్ అసద్, ఉన్నవ నాని, దూరు రత్నబాబు, బండిళ్ల పోతురాజు, అక్కిదాసు కిరణ్, షేక్ దుబాయ్ బాబు, పాట్లూరి అశోక్, అత్తోట అమృతరాజు, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కొల్లిపర మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి, మాజీ అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, వంగా సుధాకరరెడ్డి, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, తాడిబోయిన రమేష్, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, తోట రఘురాం, వీర్లపాటి విజయలక్ష్మి, పెచ్చింగ్ సుభాని, శానంపూడి రఘురామిరెడ్డి, పెదలంక వెంకటేశ్వర్లు, చింకా సురేష్, కఠారి హరీష్, జలగం రామకృష్ణ, మన్నవ ప్రభాకర్, మల్లెబోయిన రాము, కోలా వాసు, కాళిదాసు సత్యం, కుర్రా జస్వంత్, ప్రసాదం సురేష్, బోరుగడ్డ సురేష్, షేక్ జకీరా, షేక్ ఇస్రత్, తురకా శాంతి, మన్నవ శాంతిశ్రీ, ఇందిరా ప్రియదర్శిని, పెసర్లంక రమణ, కందుల రాంబాబు, కాకి మనోజ్, గోరికపూడి బాలరాజు, కిరణ్ చంద్ర, షేక్ ఫరీద్, దుండి కొండారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజు, కనపర్తి ప్రకాష్, ఈదా హర్ష, దాసరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులపై సమగ్ర సర్వే అవసరం

రేపల్లె డిప్యూటీ గణాంక అధికారి రజని



కొల్లూరు: సేద్యం కోసం వినియోగిస్తున్న సాగునీటి వనరుల సమగ్ర సర్వే తక్షణం చేపట్టాలని రేపల్లె డిప్యూటీ గణాంక అధికారి రజని అన్నారు. మంగళవారం కొల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో రైతులు సాగుకు నీటి వనరులు ఏ పద్ధతిలో వినియోగిస్తున్నారో వివరాలు సేకరించాలన్నారు. బోర్లు, బావులు, ఇతర పద్ధతులను వినియోగిస్తున్నారా అన్న విషయాన్ని సమగ్రంగా తెలుసుకోవాలని సూచించారు. మండలంలో బోర్లు, కాలువల ద్వారానే సాగు నీటి వినియోగం జరుగుతుందని ఆమె దృష్టికి తీసుకురావడంతో మండలంలో ఎన్ని బోర్లు ద్వారా ఎంత ఆయకట్టుకు సాగు నీరు అందుతుందో సర్వే చేపట్టి వివరాలు అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జౌళి శాఖ నుంచి చేనేతను వేరుచేసి రక్షించాలి



సమావేశంలో పాల్గొన్న చేనేత సంఘం, సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్: జౌళి శాఖ నుంచి చేనేతను వేరు చేసి ప్రత్యేకంగా రక్షించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత పరిశ్రమ రక్షణకు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 11వ తేదీన పెడనలో చేనేత అధ్యయన యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రిబేట్, యార్న్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, పావలా వడ్డీ, మార్కెటింగ్ ఇన్సెంటివ్ బకాయిలు కలిపి రూ.127.87 కోట్ల బకాయిలుగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని తక్షణమే విడుదల చేసిన సహకార సంఘాలు, చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాల పాలకవర్గ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని.. మగ్గం ఉన్న ప్రతి నేతన్న కుటుంబానికి నేతన్న భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.36 వేలు ఇవ్వాలని కోరారు. చేనేతపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి మోహనరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులు గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రాచూరు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భట్టిప్రోలు మండలం రాచూరు ఐసీఆర్‌పీఎస్ పరిధిలో కంపాక్ట్ బ్లాక్స్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ ఎస్.ప్రకాష్ కుమార్ అజోల వేయడంపై రైతులకు వివరించారు. పొలం గట్లపై బంతి మొక్కలు నాటాలని సూచించారు. ద్రవ జీవామృతం పిట్టును పరిశీలించారు. జీవామృతం, నీమాస్త్రం తయారీ తదితర వాటి గురించి వివరించారు. భట్టిప్రోలులో ఏటీఎం పద్ధతిలో సాగుకు ముందుకు వచ్చిన కేఎస్‌కే ప్రిన్సిపాల్ పొలాన్ని పరిశీలించారు. వెల్లటూరులో ఐసీఆర్పీఎస్ రిజిస్టర్ పరిశీలన చేశారు. రైతులకు కోడిగుడ్డు ద్రావణం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్ ఇన్‌చార్జి, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన తాగునీరు


జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: తాడికొండ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు సరఫరాకు జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరు చేసిన పనులను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో తాడికొండ నియోజకవర్గ శాసన సభ్యులు తెనాలి శ్రావణకుమార్‌తో కలిసి తాడికొండ నియోజకవర్గ పరిధిలో జల జీవన్ మిషన్, ఇతర పథకాల ద్వారా మంజూరు చేసిన తాగునీటి సరఫరా పనులపై గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తాడికొండ నియోజకవర్గ పరిధిలోని తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు తుళ్లూరు మండలాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న నీటి సరఫరా పంపిణీ పైపులైను, నీటి వనరుల పెంపుదల, ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటు మరమ్మతు పనుల పురోగతిపై గ్రామాల వారీగా అధికారులతో సమీక్షించి, పనులు వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

మంగళగిరి టౌన్: డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరుగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ కోరారు. మంగళగిరి నగర పరిధిలోని పాత మంగళగిరిలో మంగళవారం మున్సిపల్ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులను 60 ఏళ్లు నిండాయని తొలగించడం దారుణమన్నారు.

ఎల్‌వోసీ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4వ వార్డుకు చెందిన బొమ్మిరెడ్డి అప్పిరెడ్డికి రూ.72,480లు.. 16వ వార్డుకి చెందిన గుండు వెంకట రమాదేవికి రూ.80,132లు.. 20వ వార్డుకు చెందిన మానుపాటి వెంకటేశ్వర్లుకు రూ.40,350లు.. 22వ వార్డుకు చెందిన ఎం.సీతకు రూ.25,000 చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు, మేకా పుల్లారెడ్డి, మండవ గోపాలరావు, అద్దంకి మురళి, ఇట్టా భాస్కర్, హనుమంతు, లావణ్య, షేక్ అక్బర్, పర్వీన్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు రచయితల సంస్మరణ



మాట్లాడుతున్న లక్కరాజు లక్ష్మణరావు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలిశాఖ ఆధ్వర్యంలో ఇక్కడి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో భాగంగా మంగళవారం సాయంత్రం ప్రజా రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, నార్ల చిరంజీవిని స్మరించుకున్నారు. సభకు రచయిత, ఉత్తమ ఉపాధ్యాయ లక్కరాజు లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన మద్దకూరి చంద్రం ప్రోత్సాహంతో సుంకర సత్యనారాయణ నాటి కమ్యూనిస్టు పత్రికలకు రచనలు చేశారని చెప్పారు. ప్రజానాట్యమండలికి కావాల్సిన నాటక, నాటిక, జానపద కళారూపాలను వేలాది ప్రదర్శనలిచ్చారని చెప్పారు. మరో కమ్యూనిస్టు కవి వాసిరెడ్డి భాస్కర రావుతో కలిసి మాభూమి, ముందడుగు నాటకాలు రాశారని గుర్తు చేసుకున్నారు. వీరిద్దరు సినీరంగంలోనూ పనిచేశారని చెప్పారు. ఇస్కఫ్ నాయకురాలు బెజ్జంకి నాగమణి, నటుడు బెల్లంకొండ వెంకట్, సీపీఐ సహాయ కార్యదర్శి తుంగా బాలస్వామి, బొల్లిముంత కృష్ణ, విజయసారథి, మాన్యం బద్రీనాథ్, సయ్యద్ రిహాన్‌బాషా మాట్లాడారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న జీడీసీసీబీ మాజీ డైరెక్టర్ చంద్రమోహన్

తెనాలిటౌన్: పాడి రైతుల సంక్షేమానికి పాల ఉత్పత్తిదారుల సంఘం కృషి చేస్తుందని జీడీసీసీబీ మాజీ డైరెక్టర్ కావూరి చంద్రమోహన్ పేర్కొన్నారు. రూరల్ మండలం గుడివాడ గ్రామంలో మంగళవారం పాడి రైతులకు సంగం డైయిరీ, పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బోనస్ పంపిణీ నిర్వహించారు. సంగం డైయిరీ మేనేజర్ బి.శ్రీకాంత్, జీడీసీసీబీ మాజీ డైరెక్టర్ కావూరి చంద్రమోహన్, పాలకేంద్రం అధ్యక్షుడు బొద్దులూరి సుబ్బారావు, గ్రామ సర్పంచ్ రాకేష్ పాల్గొని రైతులకు బోనస్ అందజేశారు. సంగం డైయిరీ నాలుగు శాతం, పాల ఉత్పత్తిదారుల సంఘం రెండు శాతం మొత్తం ఆరు శాతం బోనస్ రూ.1,69,505 లు మొత్తం 99 మందికి అందజేశారు. యడ్లపాటి వెంకట్రావు స్థాపించిన సంగం డైయిరీ దినదినాభివృద్ధి చెంది పాడి రైతులకు అభివృద్ధి పదంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. పాల ఉత్పత్తిని మరింత బలోపేతం చేయడానికి రైతులు పశు సంపదను పెంచి పోషించాలని సూచించారు. సర్పంచ్ రాకేష్ మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించడానికి బోనస్ పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సందీప్‌కృష్ణ, నక్కా చిరంజీవి, పాలకేంద్రం కార్యదర్శి గరికపాటి శివశంకర్ ఉన్నారు.

రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దు

మండల ప్రత్యేకాధికారి కె.దేవరాజు



కొల్లూరు: ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా అందదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందరికీ అందుతుందన్న విషయాన్ని గమనించాలని మండల ప్రత్యేకాధికారి కె.దేవరాజు అన్నారు. మంగళవారం కొల్లూరు గ్రోమోరు ఎరువుల కేంద్రంలో నిర్వహించిన యూరియా పంపిణీ కేంద్రంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరా సమృద్ధిగా జరుగుతున్న నేపథ్యంలో రైతులందరకీ యూరియా అందించడం జరుగుతుందని, రైతులు గ్రహించి నిగ్రహంగా వ్యవహరించాలని సూచించారు. తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూరియా బస్తాలు ఎవరైనా అక్రమంగా నిల్వ చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఏవో వి.నరేంద్రబాబు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీని రైతులు తమ పంటలకు వాడుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో పోలీసు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు చర్యలేవి!

తాడికొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవీటి వాగు ఉప్పొంగి రహదారి గుంతలమయంగా మారింది. దీంతో తాడికొండ–కంతేరు మధ్య రోడ్డు మార్జిన్లు భారీగా కొట్టుకుపోయి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అసలే సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదకర మార్జిన్లు వాహనదారులు, ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. వరద తగ్గి నెల రోజులు దాటినా దీనిపై సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని వాహన చోదకులు వాపోతున్నారు.